ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జయశంకర్
భూపాలపల్లి
5
ములుగు
బుధవారం 24 ఏప్రిల్ 2024




ఎక్కెలలో ఖాళీగా దర్శనమిస్తున్న ఉద్యానవన భూములు

తోటలు ఏవీ..?

- ఉద్యాన పంటలపై పట్టింపులేని ఐటీడీఏ
- గాడితప్పిన హార్టికల్చర్
- పండ్ల తోటల సాగుపై దృష్టిసారించని అధికారులు
- స్వయం ఉపాధి కోల్పోతున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 23: గిరిజనులకు పెద్ద దిక్కుగా ఉన్న ఐటీడీఏ క్రమేపీ తన అస్తిత్వాన్ని కోల్పోతోందా..? అంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఏర్పడిన ఐటీడీఏ లక్ష్యానికి దూరంగా వెళ్తుందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. 32 శాఖల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజనుల బతుకులు మార్చేందుకు ఐటీడీఏకు అంకురార్పణ జరగ్గా క్రమేణా కొన్ని శాఖలు పూర్తిగా కనుమరుగయ్యాయి. మరికొన్ని నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వాల చిన్నచూపు ఐటీడీఏకు శాపం కాగా.. వనరులు ఉన్నా అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో గిరిజనులు స్వయం ఉపాధికి దూరమవుతున్నారు. వందలాది ఎకరాల్లో భూములున్నప్పటికీ ఉద్యాన శాఖ కుంటుపడుతోంది. ఉద్యాన పంటలతో ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలనుకుంటున్న రైతుల ఆశలు నీరుగారుతున్నాయి. ఐటీడీఏలోని ఉద్యాన శాఖ(హార్టికల్చర్)పై ఐటీడీఏ అధికారుల చిన్నచూపుతో ఆ శాఖ క్రమేణా కనుమరుగవుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూములు ఉన్నప్పటికీ గిరిజనుల ఉపాధి కల్పనకు ఊతమిచ్చే పండ్ల తోటల పెంపకంపై ఆ శాఖ దృష్టి పెట్టడం లేదు. నిధులలేమి సాకుతో ఆ శాఖకు ఉన్న భూములను గాలికొదిలేశారు. మూడేళ్లుగా ఆ శాఖకు ఉన్న భూములన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గిరిజన రైతులకు భూములను లీజుకిస్తే ఆ భూముల్లో పండ్ల తోటల పెంపకానికి గిరిజనులు ముందుకొచ్చేవారని పలువురు తెలుపున్నారు. పండ్ల తోటల పెంపకంపై ఐటీడీఏ దృష్టిపెడితే గిరిజనులకు ఎంతో లబ్ధిచేకూరుతుందని గిరిజనులు అంటున్నారు.

భూములున్నా.. ఫలితం శూన్యం

హార్టికల్చర్ శాఖ పరిధిలో భూములున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. ఏటూరునాగారంలోని ఎక్కెలలో సుమారు 20 ఎకరాలు, రామన్నగూడెం వైపు వెళ్లే రహదారికి ఆనుకుని సుమారు ఆరెకరాల హార్టికల్చర్ భూములున్నాయి. ప్రస్తుతానికి ఆ భూములన్నీ ఖాళీగానే ఉన్నాయి. మండలకేంద్రంలోని వారే కాకుండా ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఏ ప్రాంతానికి చెందిన గిరిజనులకైనా ఇక్కడికి వచ్చి ఉద్యాన పంటలు పండించి ఉపాధి పొందే అవకాశం ఉంది. అయితే అధికారులు ఆ దిశగా గిరిజన రైతులను ప్రోత్సహించడం లేదు. ఐటీడీఏ కార్యాలయానికి సమీప దూరంలోనే సుమారు 25 ఎకరాల భూములున్నా అవి నిరుపయోగంగా మారాయి. ఆ భూముల గురించి పట్టించుకునే వారే కరువయ్యాడు. ఆ భూములన్నింటినీ గిరిజన రైతులకు లీజుకిచ్చి తోటల పెంపకాన్ని చేపడితే గిరిజనులకు ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక వెసులుబాటు దొరుకుతుంది. గిరిజన రైతులకు లీజుకిచ్చి ప్రోత్సాహకాలు అందించకున్నా ఆ భూములను వారికి లీజుకు ఇస్తే వారు సాగు చేసుకునే అవకాశం ఉంది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోగా భూములను ఖాళీగా ఉంచడానికి మొగ్గు చూపుతున్నారు. భూములను బహిరంగ ప్రకటన ద్వారా లీజుకిస్తే రైతులు పూలు, పండ్లు, కూరగాయాలు సాగు తదితర పనులు చేపడితే ఎంతో ప్రయోజకరంగా ఉంటుందనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. భూములు కొంతమేర అన్యాక్రాంతమవుతున్నా అధికారులు దృష్టి పెట్టడం లేదని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు.

అధికారుల్లో కొరవడిన ముందుచూపు

ఉద్యాన శాఖపై అధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు గిరిజనులు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి అనుసంధానంగా గిరిజనులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే శాఖపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి, వాణిజ్య పంటలకు అనుకూలంగా లేని పోడుభూముల్లో ప్రభుత్వం చొరవ చూపి ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు అవగాహన కల్పించి వారి భూముల్లో డ్రిప్‌ను సబ్సిడీపై కల్పించి బత్తాయి, దానిమ్మ, అరటి, మామిడి, కూరగాయాల సాగు, సపోటా తదితర ఉద్యానవన పంటల సాగుకు గిరిజనులకు తోడ్పాటునందిస్తే వారి ఆర్థిక స్వావలంభనకు అడుగులు వేసినట్లు అవుతుంది. ఏజెన్సీ గ్రామాల్లో నీటి వసతులు, ఇతర వనరులు పుష్కలంగా ఉన్న గిరిజన రైతులకు అనుకున్న స్థాయిలో ఫలితాలు లభించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఖాళీగా ఉన్నతాధికారుల పోస్టులు

ఉద్యాన శాఖలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి(పీహెచ్‌వో)తోపాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడు నెలలుగా పీహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. కొన్నినెలల క్రితం హార్టికల్చర్ అధికారి పోస్టు సైతం ఖాళీ కాగఇప్పటి వరకు భర్తీ చేయలేదు. హార్టికల్చర్ శాఖను గాడిన పెట్టాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా ఆలోచనలు చేయకపోవడంతో ఆ శాఖ నీలినీడలు కమ్ముకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వంతోపాటు ఐటీడీఏ యంత్రాంగం చొరవ చూపి ఉద్యానవన పంటల సాగుకు సహకరించాలని పలువురు గిరిజనులు కోరుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఓరుగల్లులో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ స్థానాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 'కడియం' అస్త్రంగా 36 ఏళ్ల తరువాత తొలిసారి మహిళ అభ్యర్థిని బరిలో దింపారు. గత మూడు ఎన్నికల్లో వరుసగా పరాజయాన్ని మూట కట్టుకున్న కాంగ్రెస్ ఈసారి వరంగల్‌లో గెలిచి తీరాలన్న లక్ష్యంతో వ్యూహరచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకోవటమే కాకుండా, ఆయన కుమార్తె కావ్యను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దింపారు. కడియంకు రాజకీయాల్లో ఉన్న క్లీన్ ఇమేజ్.. కాంగ్రెస్ వంద రోజుల పాలనకు తోడై విజయాన్ని అందిస్తుందనే లెక్కల్లో శ్రేణులు ఉండగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీల్లో ఆ పార్టీకి భారీగా ఓట్లు పోలవటం.. ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే కావడం తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది.

వరంగల్‌లో విజయమే లక్ష్యంగా పావులు..

తొలినుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న వరంగల్‌లో ఓటర్లు మూడు పర్యాయాలు బీఆర్ఎస్‌కు జై కొట్టారు. నియోజకవర్గాల పునర్విభజనలో 2009లో ఏడు నియోజకవర్గాలతో కలిపి వరంగల్ లోక్‌సభ స్థానం ఏర్పడింది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజయం సాధించారు. ఆ తరువాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి విజయం సాధించారు. 2015లో కడియం శ్రీహరి ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పసునూరి దయాకర్ విజయం సాధించడంతో పాటు 2019లోనూ రెండోసారి దయాకర్ విజయం సాధించారు. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ వరుసగా మూడుసార్లు గెలిచి కంచుకోటగా మల్చుకుంది. దీంతో ఈసారి పక్కాగా వరంగల్ స్థానంలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం 42మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు అప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన ఆయన కూతురు కావ్యని కాంగ్రెస్‌లో చేర్చుకుని మరీ టికెట్ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టడంతో పాటు మహిళ అభ్యర్థికి అవకాశం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం లెక్కలు వేసింది. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి తన 40ఏళ్ల రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ఉన్నారని, కబ్జాలు, ఇతర ఆరోపణలకు తావివ్వలేదని.. ఈ కారణంగానే కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకుని రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై రాజకీయ అస్త్రంగా వదిలారనే చర్చ జరుగుతోంది. కడియంకు ఉన్న



ఓరుగల్లుపై.. కడియం అస్త్రం!

- వ్యూహాత్మకంగానే కావ్యను బరిలోకి దించిన కాంగ్రెస్
- 36ఏళ్ల తరువాత మహిళ అభ్యర్థికి అవకాశం
- పదేళ్లుగా మూడు ఎన్నికల్లో చేతికి చిక్కని వరంగల్
- బీఆర్ఎస్‌కు కడియంతో చెక్‌పెట్టేలా రేంవత్‌రెడ్డి వ్యూహం
- లోక్‌సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీవారే..
- నేడు వరంగల్‌లో జనజాతర సభ.. హాజరవనున్న రేవంత్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో...

మోసపూరిత హామీలతో గద్దెనెక్కారు


వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

- ఈ ఎన్నికల్లో రేవంత్‌కు బుద్ధి చెప్పాలి..
- కడియం.. నయవంచకుడు, విశ్వసఘాతకుడు
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్

7లో..

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

టీఎస్ఎన్‌పీడీసీఎల్ జీఎం బీకంసింగ్

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 23: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని తెలంగాణ రాష్ట్ర నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎన్‌పీడీసీఎల్) జనరల్ మేనేజర్ (కమర్షియల్) బీకంసింగ్ అన్నారు. భూపాలపల్లి సర్కిల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి గనుల వృత్తి శిక్షణా కేంద్రం హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. బీకంసింగ్ మాట్లాడుతూ వినియోగదారులతో మార్యదగా వ్యవహరిస్తూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని అన్నారు. సబ్‌స్టేషన్లు, ఎల్‌టీ లైన్ల రిపేరు సమయంలో ముందస్తుగా వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎస్ఈ మల్సూర్ నాయక్, డీఈ డి.నాగరాజు, ఏడీలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- గత హామీలను విస్మరించిన పార్టీని ఓడించాలి
- మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత

వివరాలు 8వ పేజీలో...

పెళ్లయిన 19 రోజులకే..
నవ వధువు ఆత్మహత్య


కోమలిక మృతదేహం, కోమలిక పెళ్లినాటి చిత్రం (ఫైల్)

మంగపేట, ఏప్రిల్, 23: పెళ్లయిన 19 రోజులకే నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై గోదారి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన నిమ్మల ఏడుకొండల్, పద్మ దంపతుల రెండో కుమార్తె కోమలిక (20)కు ఏటూరునాగారం మండలం రాంనగర్‌కు చెందిన నూకల సత్యనారాయణ, సమ్మక్క దంపతుల కుమారుడు గోవింద్‌తో ఈనెల 4న వివాహం జరిగింది. వారం రోజులకే గోవింద్, కోమలిక మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో కోమలిక పుట్టింటికి వచ్చింది. ఆ వెంటనే గోవింద్ కూడా అత్తగారింటికి వచ్చాడు. కుటుంబ సభ్యులందరూ పెళ్లికి వెళ్లడంతో కోమలిక, గోవింద్ మాత్రమే ఇంట్లో ఉన్న క్రమంలో సోమవారం ఇద్దరి మధ్య మళ్లీ గొడవ మొదలైంది. దీంతో గోవింద్ తిరిగి తన ఇంటికి వెళ్లిపోగా మనస్తాపానికి గురైన కోమలిక బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. అస్వస్థతకు గురైన ఆమెను గమనించిన పెదనాన్న కుటుంబ సభ్యులు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగానే సోమవారం రాత్రి కోమలిక మృతి చెందింది. మృతురాలి తల్లి పద్మ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలకు కారణాలు తెలియరాలేదు.

వడదెబ్బతో ఒకరి మృతి


రాజు (ఫైల్)

ములుగు, ఏప్రిల్ 23: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ములుగు మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన చింతల రాజు(36) కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో భార్య ఇద్దరు పిల్లలతో కలిసి మూడేళ్ల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి రాజు తన తల్లి సారమ్మతో కలిసి మహ్మద్‌గౌస్‌పల్లిలోనే జీవిస్తున్నాడు. ఆదివారం కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన్ను తల్లి ములుగు ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. ఈక్రమంలో సోమవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిన రాజు కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. నడుచుకుంటూ ములుగు మండలంలోని పంచోత్కులపల్లి గ్రామం వైపు వెళ్లాడు. స్థానికులు తాగేందుకు నీళ్లు ఇవ్వడంతో కొద్దిసేపు సేదతీరిన ఆయన కాలినడకన వెళ్లిపోయాడు. ఈక్రమంలో ఎండవేడిని భరించలేక గ్రామ సమీపంలో స్పృహతప్పి పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో ప్రాణాలు వదిలాడు. మంగళవారం ఉదయం ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ములుగు ఆస్పత్రి మార్చురీ వద్ద రాజు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడి తల్లి సారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

బీజేపీ అబద్ధాల పార్టీ

లక్షమందితో మడికొండ బహిరంగ సభ నిర్వహణ
స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మాట్లాడుతున్న కడియం శ్రీహరి

న్యూశాయంపేట, ఏప్రిల్ 23 : బీజేపీ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ అబద్ధాలతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడారు. బుధవారం మడికొండలోని లక్షమందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరవుతారన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా సుమారు లక్ష మంది హాజరవుతారన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కావ్య 2 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలవబోతుందన్నారు. బీజేపీ పార్టీ వామపక్ష భావజాలాన్ని, అంబేద్కర్ వాదాన్ని అణచివేస్తోందని, అందుకే దేశవ్యాప్తంగా అందరు కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి సిద్ధమయ్యారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కాంగ్రెస్‌కు సీపీఐ పార్టీ మద్దతు ఇస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చి అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కృషి చేస్తామన్నారు. దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలను రోడ్డు పాలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పేదలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల వ్యతిరేఖ పార్టీగా బీజేపీ మారిందని, అలాంటి బీజేపీని ఓడించి తీరుతామన్నారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కడియం కావ్య గెలుపునకు ప్రతీ సీపీఐ కార్యకర్త కష్టపడి పని చేయాలని, ప్రస్తుతం పరిణామాలను గమనించి ఒక్కస్థానం ఇవ్వకున్నా ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సీపీఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవితోపాటు హనుమకొండ, వరంగల్ జి ల్లాల సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యేలు, సీపీ

మడికొండ : మడికొండలో బుధవారం జరగనున్న కాంగ్రెస్ జన జాతర సభా స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజ్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా సందర్శించి సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వాహకులకు సూచించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేయడమే కాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు.

ముగ్గురిపై భూ కబ్జా కేసు

ఒకరిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


కట్ల పూర్ణచందర్‌ను విచారిస్తున్న సీఐ నరేష్‌కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 23: భూపాలపల్లి మండలం కొంపెల్లి శివారు 8 ఇన్‌క్లైన్ రహదారి బీసీకాలనీలోని సర్వే నంబరు 186/1లో భూకబ్జా విషయమై ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకరిని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. ఈ భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదు అందగా సమగ్ర విచారణ జరిపి కొత్త హరిబాబు, కొత్త దశరథం, కట్ల పూర్ణచందర్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. వీరిలో కొత్త హరిబాబు ఓ భూ కబ్జా కేసులో ఇప్పటికే అరెస్టు కాగా ఈ కేసులోనూ ఆయన ప్రధాన నిందితుడని తెలిపారు. కట్ల పూర్ణచందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా కొత్త దశరథం పరారీలో ఉన్నాడని తెలిపారు.

నాయీబ్రాహ్మణులకు మోదీ చేయూత

విశ్వకర్మ పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థిక సహాయం
వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మద్దతు
నాయీబ్రాహ్మణ సంఘం నాయకుల వెల్లడి


అరూరికి మద్దతు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులకు రూ.3లక్షల రుణం అందించి ఆదకుందని హనుమకొండ జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూడటానికి ప్రధాని మోదీనే కారణమన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వరంగల్ లోక్‌సభ బీజేపీ కార్యాలయంలో అరూరి రమేష్‌ను నాయీ బ్రాహ్మణులు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులు కష్టసుఖాల్లో అరూరి రమేష్ ఎల్లప్పుడు అండగా ఉంటున్నారని గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రమేష్‌కు అత్యధిక మెజారిటీ వచ్చేందుకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని నాయీ బ్రాహ్మణులందరూ పార్టీలకతీతంగా

మిగతా 8వ పేజీలో...

భూములు కోల్పోయి బతకలేం..

అభివృద్ధి పేరుతో లాక్కుంటే ఎలా..?
నేషనల్ హైవే నిర్మాణ సర్వేను అడ్డుకున్న రైతులు


పురుగుల డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతులు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 23: జాతీయ రహదారి నిర్మాణం కోసం వ్యవసాయ భూములను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వబోమని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. గ్రామంలో రెవెన్యూ అధికారులు నేషనల్ హైవే రహదారి నిర్మాణం కోసం మంగళవారం సర్వే చేస్తుండగా రైతులు అడ్డుకున్నారు. తమ భూములు లాక్కొని రోడ్డు నిర్మాణం చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని పురుగుల మందు డబ్బాలతో నిరసనకు దిగారు. వ్యవసాయమే తమకు జీవనాధారమని, భూములు కోల్పోతే బతికేదెలా..? అని అధికారులను నిలదీశారు. అభివృద్ధి పేరుతో భూములను లాక్కుంటే ఇచ్చేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా శాంతించకపోవడంతో అధికారులు సర్వేను నిలిపివేసి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే
దేశాభివృద్ధి
ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్
రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి మంత్రి శ్రీధర్‌బాబు

8లో

ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్ దొంగల అరెస్టు

హసన్‌పర్తి, ఏప్రిల్ 23: చాలా రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతూ వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్, మోటార్లు, ఇనుప సామగ్రిని దొంగిలించిన ఏడుగురు నిందితులను మంగళవారం హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లి చర్చి ప్రాంతంలోని పూరిగుట్టకు చెందిన భూక్య రమేశ్, బోడ రాజేందర్, వాంకుడోతు రాజ్‌కుమార్, గోపగాని ప్రశాంత్, అంబి సురేష్, భూక్య నరేష్, బోడ వినోద్‌కుమార్ డబ్బును సంపాదించాలనే ఉద్దేశంతో పోలీసస్టేషన్ల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, వాటిలోని కాపర్ వైర్లను, ఇనుప సామగ్రిలను దొంగతనాలు చేస్తుడేవారు. మంగళవారం హసన్‌పర్తి పోలీసులు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక ఆటోలో నలుగురు దొంగిలించిన సామానుతో, మరో ముగ్గురు స్కూటీపె వెళ్తున్నారు. ఆటో, స్కూటీలను ఆపమని అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. అందులో దొంగిలించిన వస్తువులు ఉన్నాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆ సామన్లను తామే దొంగిలించామని ఒప్పుకున్నారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, కమలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక ఇనుపగేటు, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్లు, ఇనుప సామాన్లు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. వస్తువులను స్వాధీనం చేసుకుని, ఏడుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు, క్రైం కానిస్టేబుల్ క్రాంతి కుమార్, మధు, ఐటీ కోర్ ఏఏవో సల్మాన్ పాషా, నగేష్‌లను సీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ అభినందించారు.

ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అన్నారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ పరీక్షల సీఎస్, డీవోలతో పరీక్షల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై మాట్లా డుతూ.. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి అవా ంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు పరీక్షలు జరుగనున్నాయి. టెన్త్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ సెషన్‌లో జరుగుతాయి. అలాగే ఇంటర్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలా..

టెన్త్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 292 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వరంగల్‌లో 3 కేంద్రాల్లో 552 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 577 మంది, జయశంకర్ భూపా లపల్లిలోని ఒకే కేంద్రంలో 208 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 526, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 4 కేంద్రాల్లో 936 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వరంగల్‌లో 4 కేంద్రాల్లో 650 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 727 మంది, జయశంకర్ భూపాలపల్లిలో 2 కేంద్రాల్లో 378 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 602, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 3 కేంద్రాల్లో 608 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెన్త్‌కు 14 కేంద్రా లను ఏర్పాటు చేయగా 2,429 మంది, ఇంటర్‌కు 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,901 మంది పరీక్షలు రాయనున్నారు.

29 నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట, ఏప్రిల్ 23: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో చేపడుతున్న రైల్వే ట్రాక్ నిర్మాణం, మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 29 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా సికింద్రాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే (12713, 14)శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైలును ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు, అలాగే మే 16 నుంచి 22 వరకు రద్దు చేశారు. (07757) వరంగల్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - కాజీపేట జంక్షన్‌ల మధ్య నడిచే పుష్‌పుల్ రైళు మే 3, 4 తేదీలలో రద్దు చేస్తున్నామని, అనంతరం రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం 24 ఏప్రిల్ 2024
7 www.andhrajyothy.com

విశిష్ట తీర్పుల కోట



హనుమకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం విశిష్టమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నది. ఇక్కడి ఓటర్లు ప్రతీసారి విలక్షణమైన తీర్పు ఇస్తూ వచ్చారు. ఒకసారి మరోసారి తిరిగి ఆవిర్భవించిన మహబూబాబాద్ లోకసభ స్థానం మొదట జనరల్ స్థానంగా ఉండి ఆ తర్వాత ఎస్టీకి రిజర్వు అయింది. ఇటికాల మధుసూదన్ రావు, రామసహాయం సురేందర్‌రెడ్డి వంటి ప్రముఖ నేతలను పార్లమెంట్‌కు పంపిన ఘనమైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇది. మరో దఫా ఎన్నికలకు సిద్ధమైంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట అయిన మహబూబాబాద్ లోకసభ స్థానంలో 2019, 2024 మధ్య రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ గుప్పిట్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికల్లో జనం బలంతో గెలిచి మానుకోటపై జెండా ఎగురవేసేది ఎవరు? ఈ లోకసభ ఎన్నికల్లో సీన్ ఎలా ఉండబోతోంది? అన్నది సర్వత్రా చర్చనీయంగా మారింది.

1957లో..


మహబూబాబాద్ లోక్‌సభ స్థానం 1957లో ఏర్పాటైంది. నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 1967లో రద్దయింది. ఆ తర్వాత 2009లో తిరిగి ఆవిర్భవించింది. ఒకసారి రద్దయి తిరిగి ఏర్పాటైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇదే. 1957, 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన ఇటికాల మధుసూదన్‌రావు రెండుసార్లు ఈ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత 1965లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్.సురేందర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన ఆ తర్వాత 1967, 1989, 1991 ఎన్నికల్లో మూడుసార్లు వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి గెలిచి రికార్డు సృష్టించారు. 1967లో మహబూబాబాద్ నియోజకవర్గం రద్దయింది. ఈ నియోజకవర్గంలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లను కలిపి భద్రాచలం (ఎస్టీ) నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ స్థానంలో 11 సార్లు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడి తెలంగాణ, ఆంధ్రప్రాంతాలకు వారధిగా ఉన్న భద్రాచలం నియోజకవర్గం 2009లో రద్దయింది.

- ఒకసారి రద్దయి మళ్లీ ఆవిర్భావం
- నాడు జనరల్.. ఇప్పుడు ఎస్టీ రిజర్వుడు
- విశిష్ట తీర్పునిస్తున్న మహబూబాబాద్ లోక్‌సభ ప్రజలు
- ఇప్పుడు త్రిముఖ పోరులో గెలిచేదెవరో?
- బరిలో అంతా పాతముఖాలే..
- అందరూ ఎంపీలుగా చేసిన వారే..
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- 2014 తర్వాత మారిన బలాబలాలు
- మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ముఖ చిత్రం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	1,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	7,83,280	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

పునరావిర్భావం

నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 2009లో మహబూబాబాద్ నియోజకవర్గం మళ్లీ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందు జనరల్‌గా ఉన్న ఈ స్థానం ఎస్టీకి రిజర్వు అయింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఎన్నికయి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. యూపీఏ సర్కార్‌లో కేంద్రమంత్రిగా పని చేశారు. 20014 ఎంపీ ఎన్నికలు వచ్చేసరికి మానుకోట బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారింది. తొలిసారి మహబూబాబాద్‌లో గులాబీ జెండా ఎగిరింది. టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీతారాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై విజయం సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేసిన సీతారాం నాయక్.. తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన కృషిని గుర్తించి టీఆర్ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కేసీఆర్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో సీనియర్ నేత డీఎస్ రెడ్యానాయక్ కూతురు మాలోతు కవిత టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి పార్లమెంట్‌లో మొదటిసారి అడుగుపెట్టారు. మొత్తంగా మానుకోట లోక్‌సభ నుంచి ఇప్పటి వరకు ముగ్గురు గిరిజనులు ఒక్కోసారి గెలవగా, ఒక రెడ్డి నేత, ఇతర సామాజికవర్గానికి చెందిన మరొకరు రెండు సార్లు ఎన్నికయ్యారు.



ఓట్ల వివరాలు

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 15,30,367 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 746,982 మంది పురుషు ఓటర్లుండగా, 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

మారిన సమీకరణలు

2009 వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం.. 2014 ఎన్నికలు వచ్చేసరికి మారిన రాజకీయ సమీకరణాల ఫలితంగా టీఆర్ఎస్ వశమైంది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న సరికొత్త పరిణామాల ప్రభావం ఈ నియోజకవర్గంపై కూడా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో ఇక్కడ బీఆర్ఎస్ పునాదులు కదిలిపోయాయి. ఈ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు- డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం ఉన్నాయి. ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక్క భద్రాచలంలో బీఆర్ఎస్ గెలిచింది. అయితే ఇక్కడి నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. దీంతో మహబూబాబాద్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ గుప్పిట్లోకి వచ్చినట్లయింది. ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా కొనసాగుతున్నారు.



మాలోతు కవిత (బీఆర్ఎస్) | సీతారాంనాయక్ (బీజేపీ) | పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్)

పాతముఖాలే..

గతంలో మానుకోట లోక్‌సభ స్థానం నుంచి గెలిచి బీఆర్ఎస్ నుంచి టికెట్ రాక భంగపడిన సీతారాంనాయక్ బీజేపీలో చేరి కాషాయం కండువా కప్పుకున్నాడు. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో దిగి మరోసారి అదృష్టం పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన పోరిక బలరాంనాయక్ ఇదే పార్టీ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత బీఆర్ఎస్ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ఈ త్రిముఖ పోటీలో ఈసారి ఏ పార్టీ విజయపతాకం రెపరెపలాడుతోందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం ఈ సారి కూడా తనదేనన్న విశ్వాసాన్ని బీఆర్ఎస్ వ్యక్తం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో మంచి ఊపుమీద ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో మానుకోటలో సత్తాచాటుతామన్న ధీమాతో ఉన్నది. మోదీపై ఉన్న ఆకర్షణ, బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్‌పై ఆశలుపెట్టుకున్న బీజేపీ కూడా గెలవగనన్న నమ్మకంతో ఉన్నది.

బీఆర్ఎస్, బీజేపీలు చీకటి దోస్తులు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



మడికొండ జన జాతర సభా స్థలిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఏప్రిల్ 23: బీఆర్ఎస్, బీజేపీలు చీకటి దోస్తులని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదని, అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి సచ్చిన పాములాంటివాడని, ఆయనకు ఓటు వేసే వారే లేరని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు విమర్శించారు. బుధవారం మడికొండలో నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర సభాస్థలిని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భూ కబ్జాదారుడైన అరూరి రమేష్‌ను బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మోసాలు, భూకబ్జాలు చేసిన అరూరి మాటలు ప్రజలు నమ్మవద్దని తెలిపారు. సబ్బండ వర్గాల ప్రజలకు సమ న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి, జిల్లా స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, బ్లిల రవిందర్, గుర్రం అమర్‌నాథ్, గడుసు రాజు, వస్కుల నాగరాజు, వస్కుల శ్రీను, కడమంచి సాయిలు, కడమంచి మహేందర్, దండిగం సదానందం తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకే మాదిగల మద్దతు

వడ్డెపల్లి: లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకే మాదిగ హక్కుల దండోరా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నదని, మాదిగ సమాజం కడియం కావ్యను గెలిపించాలని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర ఎనలేనిదని అన్నారు. ఎస్సీ ఉప కులాల నుంచి రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి మాదిగ ఉద్యమానికి ఎంతగానో సేవ చేశారని స్పష్టం చేశారు. 2014లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి మహాజన సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మంద కృష్ణ మాదిగను ఓడించి మట్టికరిపించిన అరూరి రమేష్‌కు మంద కృష్ణ మద్దతు ప్రకటించడం చారిత్రక తప్పిదమని రేగుంట సునిల్ మాదిగ అన్నారు. బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని బహటంగానే ప్రకటిస్తుంటే మంద కృష్ణ మాదిగ ఆ పార్టీకి వంత పాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అరూరి రమేష్ మంద కృష్ణ మాదిగకు చెందిన భూమిని కబ్జా చేసిన ఘనుడని ఆరోపించారు. అలాంటి అరూరి రమేష్‌కు మంద కృష్ణ మాదిగ మద్దతు ప్రకటించడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. మాదిగ సమాజానికి లోక్‌సభ టికెట్ కేటాయించలేదని భవిష్యత్‌లో రాజ్యసభ, ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవులు కేటాయించి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో జై భీమ్ యూత్ జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్, ఎంహెచ్‌డీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్ధన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రోళ్ల సురేష్, మాట్ల రమేష్, పోశన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా లోక్‌సభ నామినేషన్ల పర్వం

ఐదోరోజు వరంగల్‌లో 9, మానుకోటలో 8 నామినేషన్లు

- నామినేషన్ వేసిన మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కవిత
- రేపటితో పూర్తి కానున్న దాఖలు గడువు



మహబూబాబాద్‌లో రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కవిత





వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చిలుముల్ల సుజాత, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ అభ్యర్థి మచ్చ దేవేందర్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రశాంతంగా జరుగుతోంది. ఐదోరోజైన మంగళవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 9, మహబూబాబాద్ (మానుకోట) నియోజకవర్గానికి ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ నుంచి మచ్చ దేవేందర్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్ కుమార్, ఇల్లందుల శోభన్ బాబు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత రెండు సెట్లు, ఆధార్ పార్టీ నుంచి జాటోతు రఘు వర్మ, ఆదివాసీ జేఏసీ నుంచి చందా లింగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి మోకాళ్ల మురళీ కృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా బానోత్ ప్రేమ్‌లాల్, పోరిక శ్యామలనాయక్, పడిగే ఎర్రయ్య నామినేషన్లు దాఖలు చేశారు. వారి నుంచి మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

కాగా ఇప్పటి వరకు వరంగల్ పార్లమెంట్ స్థానంలో ఐదు రోజుల్లో మొత్తం 26 అభ్యర్థులు 31సెట్లు, మహబూబాబాద్ లో 13 మంది అభ్యర్థులు 19సెట్లు వేశారు. కాగా నామినేషన్ల ప్రక్రియ గురువారంతో పూర్తి కానుండడంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది.

నామినేషన్ కౌంటర్

ఐదో రోజు (23-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
31	19

వరంగల్ (ఎస్సీ) : మచ్చ దేవేందర్-రెండు సెట్లు(వీసీకే పార్టీ), చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్‌కుమార్, ఇల్లందుల శోభన్‌బాబు- 2 సెట్లు (స్వతంత్ర)

మహబూబాబాద్(ఎస్టీ) : మాలోతు కవిత-2 సెట్లు(బీఆర్ఎస్), జాటోతు రఘువర్మ (ఆధార్‌పార్టీ), చందా లింగయ్య (ఆదివాసీ జేఏసీ), మోకాళ్ల మురళీకృష్ణ (సీపీఐఎంఎల్ న్యూ), పోరిక శ్యామల నాయక్, పడిగే ఎర్రయ్య బానోత్ ప్రేమ్‌లాల్ (స్వతంత్ర).



మోసపూరిత హామీలతో రేవంత్ గద్దెనెక్కారు

- ఈ ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలి
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న కేటీఆర్





సభలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్

మట్టెవాడ / రాంనగర్, ఏప్రిల్ 23 : మోస పూరితమైన హామీలిచ్చి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని, మరోసారి తెలంగాణ ప్రజలు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని నాని గార్డెన్‌లో తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశాలకు బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీ మసూద్, వరంగల్ జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ నాలుగు నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 1.85శాతం ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓడిపోయిందని 14సీట్లలో తక్కువ ఓట్లతో ఓటమిపాలయ్యామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభయ హస్తం చూపిన రేవంత్ ఇప్పుడు భస్మాసుర హస్తాన్ని చూపుతున్నారని, రైతు రుణమాఫీ, ఆడపిల్లలకు వివాహ కానుకగా తులం బంగారం, ఆసరా పింఛన్ల పెంపుదల చేయలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత నీటి, కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మోసం పార్ట్ 1 చేసిన ఆయన ఇప్పుడు మోసం పార్ట్ -2 చేస్తున్నారని, తాను హై టెన్షన్ వైర్‌నని తనను ముట్టుకుంటే మాడి మసైపోతారని అంటున్నాడని, అసలు కాంగ్రెస్‌లో కరెంటే లేదని ఎలా మసై పోతారని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయకుండా దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు నాటికి చేస్తానని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో ఎవరూ లబ్ధిపొందడం లేదని, రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కడియం శ్రీహరి నయ వంచకుడు, విశ్వాస ఘాతకుడని, అరూరి రమేష్ కూడా అలాంటి వ్యక్తేనని 2013లో పార్టీలో చేరిన కడియం శ్రీహరికి కేసీఆర్ ఎంపీగా అవకాశమిచ్చారని, మళ్లీ ఏడాదిలోపే డిప్యూటీ సీఎంగా కూడా చేశారని, ఎమ్మెల్సీగా, 2023లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని, పదేళ్లలో మూడు చట్ట సభలకు శ్రీహరికి కేసీఆర్ అవకాశం కల్పించారన్నారు. అలాగే ఈ పార్లమెంటు ఎన్నికల్లోనూ వరంగల్ టికెట్‌ను ఆయన కుమార్తె డాక్టర్ కావ్యకు ఇచ్చామని కానీ కొన్ని రోజుల్లోనే పార్టీకి రాజీనామా చేసి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నామని చెప్పి నమ్మించి గొంతుకోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరూరి రమేష్‌కు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చామని, లోక్‌సభ ఎన్నికల్లో కావ్య, అరూరి రమేష్‌కు వరంగల్ ఓటర్లు బుద్ధి చెప్పాలని, ఉద్యమకారుడైన డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగాయని, శ్రీరాముడిని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తోందని, మామునూరు ఎయిర్‌ఫోర్టు, మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా వరంగల్ ప్రజలను మోసం చేసిందన్నారు. అలాంటి మోదీని రాహుల్ గాంధీ విమర్శిస్తుంటే ఇక్కడ రేవంత్‌రెడ్డి బడే భాయ్ అంటూ మోదీని పొగుడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీ విధానమేంటో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను మోసగిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను ఓటుతో తొక్కేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10కి పైగా పార్లమెంట్‌సీట్లు గెలిస్తే కేసీఆర్ రాజకీయాలను శాసిస్తాడని కేటీఆర్ పేర్కొన్నారు.

శ్రీహరి అవినీతి తిమింగళం.. కావ్య డమ్మీ..

మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య..

నమ్మకద్రోహి, అవినీతి తిమింగళం కడియం శ్రీహరి అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఘాటు విమర్శలు చేశారు. తాను 1994లో టీడీపీ టికెట్‌ను నిరాకరిస్తే కడియం శ్రీహరి ఆ టికెట్ తీసుకొని గెలిచారన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలి పోతుందని చెప్పిన ఆయన ఇప్పుడు అభివృద్ధి కోసమంటూ కాంగ్రెస్‌లో చేరి రోజుకో మాట మాట్లాడుతున్నారని ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారన్నారు. శ్రీహరి బ్లాక్ మెయిలింగ్ చేస్తూ అన్ని పదవులను అనుభవించారని, దళితులను అణగదొక్కి పదవులు పొందారన్నారు. కడియం కులం పై ఇప్పటి వరకు స్పష్టత లేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పు అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

బీఆర్ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పులో రూ.4వేలకోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. వరంగల్ బస్టాండ్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కలెక్టరేట్ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ గెలిచి ఐదు నెలలు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజలను కలవడం లేదని వారి సమస్యలు విన్న దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పల్లం రవి పద్మ, బోగి సురేష్‌సువర్ణ, దిడ్డి కుమారస్వామి, బస్వరాజు శిరీష, మరుపల్లి రవి, గందె కల్పననవీన్, సిద్దం రాజు, బీఆర్ఎస్ నాయకులు కంచె సంపత్, సయ్యద్ మసూద్, తునికి రమేష్‌బాబు, డాక్టర్ హరి రమాదేవి, దాచెపల్లి సీతారాం, బయ్య స్వామి, బొల్లం సంపత్, కొమ్మిని సురేష్, నీలం రాజ్ కిశోర్, గోరంట్ల మనోహర్, ఎలుగం శ్రీనివాస్, కుందారపు రాజేందర్, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే ఓబీసీల అభివృద్ధి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఓబీసీ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి తోడ్పాటునందిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద బంక్వెట్ హాలులో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి ఓబీసీ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల్లో ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడు లేరని అన్నారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారని కీర్తించారు. మరోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కరోనాకాలంలో దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రధాని మోదీ.. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదని ప్రారంభించిన ఉచిత బియ్యం పంపిణీని ఇప్పటికీ కొనసాగిస్తున్నారన్నారు. భారత్ ఎన్నో విజయాలు సాధించడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మోదీ పాలనలో స్వచ్ఛమైన పాలన అందుతోందన్నారు. దేశం మోదీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలను దోచుకోవడంతోనే కేసీఆర్ గడిపారన్నారు. కేసీఆర్ ప్రజాపాలన మరిచి ఫామ్‌హౌస్ పాలనకే పరిమితమయ్యారన్నారు. ఇక కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథా అని, రెండు పార్టీలు ఒకటేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, ఓబీసీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జి వినయ్, ఉపాధ్యక్షులు సంజయ్ గనాటే తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా హనుమాన్ శోభాయాత్ర

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో మంగళవారం రాత్రి ఘనంగా శోభాయాత్ర జరిగింది. కుందూరుపల్లి నుంచి ప్రధాన రహదారి మీదుగా భూపాలపల్లి హనుమాన్ దేవాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమం భజరంగ్‌దళ్ ఇన్‌చార్జి అల్లం సాగర్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవారావు, బీజేపీ జిల్లా అధ్యక్షడు నిశీధర్‌రెడ్డి, నాయకులు ఎరుకల గణపతి, సురేష్, అనిల్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, రాజేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

కాటారం: మండలంలో హనుమాన్ విజయోత్సవ(చిన్న జయంతి) వేడుకలు ఘనంగా జరిగాయి. ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం, రేగులగూడెం, గంగారం, కొత్తపల్లి, ధర్మసాగర్, గంగపురి, దామెరకుంట, గూడూరు, కాటారం, గారెపల్లి భక్తాంజనేయ, అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్, వేదాంతం గణేష్, పనకంటి ప్రవీణ్, లక్ష్మీకాంత్, ఆశీష్, నరహరి అష్టోత్తర శతనామావళి, రుద్రాభిషేకం నిర్వహించారు. మండలంలో హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులు కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు.

● మహదేవపూర్: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన అంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హనుమాన్ మాలధారులు పూజల్లో పాల్గొన్నారు. పలువురు మాలధారులు చిన్న జయంతి సందర్భంగా హనుమాన్ దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో హనుమాన్ శోభాయత్ర

● మంగపేట: మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, నడిమిగూడెం, దేవనగరం, అకినేపల్లి- మల్లారం తదితర గ్రామాల్లో హన్‌మాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మహబూబాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 23 : ఎన్నికల హామీలను తుంగలో తొక్కి, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి.. తగిన బుద్ధి చెప్పాలని మానుకోట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ మాలోతు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఎంపీ క్యాంపు కార్యాలయం ఎదుట పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లిందని, అందుకు ఉదాహరణ మానుకోటలో సీఎం రేవంత్‌రెడ్డి సభనేనని చెప్పారు. జనం కోసం సీఎం ఎదురు చూడడం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. తనపై తనకు నమ్మకం లేక సీఎం దేవుడిపై ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పడం దారుణమన్నారు. కాంగ్రెస్ వారు దేవుడిమీద ఒట్టేసి ఓట్లు అడుగుతుండగా, బీజేపీ నేతలు దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారన్నారు. నా విశ్వాసం.. నా బలం, నా బలగం బీఆర్ఎస్ శ్రేణులేనని చెప్పారు. ప్రజా గొంతుక బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే సంక్షేమం : రవిచంద్ర

తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎండకాలం కూడా చెరువులు మత్తళ్ల పోశాయని, 2014 కంటే ముందు రాష్ట్రంలో 30 లక్షల టన్నుల వరి పంట పండితే.. ఆ తర్వాత క్రమేణా 3 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి అయిందని, వరిలో దేశంలో పంజాబ్ రాష్ట్రం తర్వాత తెలంగాణ ద్వితీయ స్థానానికి చేరుకుందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ గిరిజన జిల్లా మానుకోట అభివృద్ధికి కేసీఆర్ వందల కోట్ల నిధులిచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదన్నారు. సమావేశంలో మానుకోట, ములుగు జడ్పీచైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడెటి నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్. రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, రేగ కాంతారావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ రవికుమార్, డీఎస్. రవిచంద్ర, మర్రి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో మళ్లీ బయటపడ్డ వర్గపోరు

మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ వర్గపోరు మరోమారు బయట పడింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ కవిత నామినేషన్ వేసిన అనంతరం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రసంగిస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పులు మళ్లీ చేయవద్దని. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన చందంగా పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడవద్దని మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు అనుచరులు ఇప్పుడెందుకు ఆ విషయాలని, ఎవరూ మోసం చేశారని సమావేశ ఉద్దేశం చెప్పాలని అన్నారు. గత విషయాలు ఎందుకు మాట్లాడవద్దని శంకర్ నాయక్ అనుచరులు అన్నారు. మాజీఎమ్మెల్యే శంకర్ నాయక్ సైతం కొట్లాడుకుందామంటే, కొట్లాడుకుందాం.. నో ప్రాబ్లమ్ అంటుండగానే ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఒకదశలో రవీందర్‌రావు అనుచరులకు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అనుచరుల మధ్య వాగ్వాదం తీవ్రత పెరుగుతుండడంతో ఎంపీ కవిత, శంకర్‌నాయక్ చేతిలో మైకు తీసుకుని జైతెలంగాణ.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదిస్తూ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. తరువాత ఎంపీ కవిత, శంకర్‌నాయక్‌కు మళ్లీ మైక్ ఇవ్వడంతో యథావిధిగా ప్రసంగం కొనసాగించారు.

ఆ భూమితో నాకేం సంబంధం..?

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 23: అటవీ శాఖ భూమి ఆక్రమణ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి కొంపెల్లి శివారులో 106 ఎకరాల అటవీ భూమిని ఓ ప్రైవేటు వ్యక్తి కాజేయాలని చూశాడని, అందులో తన హస్తం ఉందని వస్తున్న ఆరోపణలు సరికావని అన్నారు. తాను అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ ఆస్తులను కాపాడటంపై ప్రత్యేక దృష్టి పెట్టానని తెలిపారు. 106 ఎకరాల్లో కొంత భాగంలో ఎకో పార్కు ఏర్పాటైతే తానే ప్రత్యేక చొరవ చూపి అభివృద్ధి చేశానని, ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చానని పేర్కొన్నారు. ఎకో పార్కు విషయంలో ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయిస్తే అతనిడికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఆ వెంటనే అటవీ శాఖ అధికారులను పిలిపించి సుప్రీంకోర్టులో రీఅప్పీల్ వేయించేలా కృషి చేశానని అన్నారు. ఇదే విషయమ్మై న్యాయ శాస్త్రంపై అవగాహన కలిగిన ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్ సలహా కూడా తీసుకున్నామని తెలిపారు. అటవీశాఖ భూమి ఆక్రమణ ప్రయత్నం వెనుక స్థానిక ప్రస్తుత ఎమ్మెల్యే బంధువులు పెట్టుబడిదారులుగా ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

అటవీ గ్రామాల్లో ప్రచారం

భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైన ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, నాగారం గ్రామాల్లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ, బీఆర్‌ఎస్

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి మంత్రి శ్రీధర్‌బాబు



మహదేవపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, ఏప్రిల్ 23: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో గత బీఆర్ఎస్ సర్కారు పదేళ్లపాలనలో ప్రజలను మోసగించాయని ఆరోపించారు. పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి మంత్రి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, మైనారిటీలు, బడుగు, బలహీన వర్గాలు, రైతులను బీజేపీ, బీఆర్ఎస్‌లు వంచించాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లోపే గ్యారెంటీ పథకాలను అమలు చేసిందన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత రైతులకు రుణమాఫీ చేసి చూపుతామని హామీ ఇచ్చారు. మంథని నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో త్వరలో ఓ పెద్ద పరిశ్రమను నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పెద్దపల్లి ఎంపీగా వంశీని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, డీసీఈ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, జడ్పీటీసీ అరుణ, ఎంపీపీ రాణిబాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపుతో తదితరులు పాల్గొన్నారు.

● కాటారం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండలకేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, అన్ని నాసి రకం నిర్మాణాలు చేపట్టిందని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులు దెబ్బతినగా ఓడేడు వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలిపోవడం బీఆర్ఎస్ అవినీతికి పరాకాష్ట అని మండిపడ్డారు. యువతకు, నిరుద్యోగులకు సొంత సంస్థలతో తోడ్పాటునందిస్తున్న యువనేత గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఇచ్చిన మెజారిటీ కన్నా అధికంగా వంశీకి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, నాయకులు మంత్రి మల్లయ్య, సుగుణ, స్వప్న, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● మహాముత్తారం: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ మండల కేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. వంశీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ దొందూదొందే అని, ఆ పార్టీల మాటలు ప్రజలు నమ్మొద్దని అన్నారు. వంశీకృష్ణను ఎంపీగా అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజబాపు, ఎంపీపీ సుభద్ర, జడ్పీటీసీ శారద, నాయకులు దుర్గయ్య, దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో 11 మంది నామినేషన్ల దాఖలు

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి(ఎస్సీ రిజర్వ్‌డ్) పార్లమెంటు స్థానానికి మంగళవారం 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు అభ్యర్థుల సంఖ్య 33కు చేరుకున్నది. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్ (రెండోసెట్), తాళ్లపల్లి నరేష్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేష్, కట్కూరి సందీప్(రెండోసెట్), సోల్లు రంజిత్, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా(డెమోక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేష్(రెండో సెట్), అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, బీఎస్పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజనర్సయ్య, సోషలిస్టు పార్టీ ఇండియా అభ్యర్థిగా ములకల కనకయ్య తలా ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని, ఇప్పటి వరకు ఐదు రోజుల్లో 33 మంది అభ్యర్థులు 42 సెట్లలో నామినేషన్లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నాయీబ్రహ్మణులకు మోదీ చేయూత

(5వ పేజీ తరువాయి)

శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తనకు మద్దతు తెలిపిన నాయీ బ్రాహ్మణులకు అరూరి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, కుర్మిల్ల రమేష్, కస్తూరి నవీన్, కొత్తపెల్లి కిరణ్, మొగిలిచర్ల జనార్దన్, నవీన్, రమేష్, సాంబయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సీతక్కపై అసత్య ఆరోపణలను సహించం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

గోవిందరావుపేట, ఏప్రిల్ 23: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కపై బీఆర్ఎస్ గూండాలు సామాజిక మాధ్యమాల్లో అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్ గూండాలు కావాలనే మంత్రి సీతక్కపై సామాజిక మాధ్యమాల్లో అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలన్నారు. ఇరవై ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకురాలిగా పనిచేశారని అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అందించిన సేవలకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందని, అలాంటి సీతక్కపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని అన్నారు. అదేవిధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 25న మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జరిగే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు వంగ రవియాదవ్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, రేగ కళ్యాణి, దాసరి సుధాకర్, శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ చైర్మన్

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 23: మొగుళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం ఆయన 50 మంది కార్యకర్తలతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు.



నర్సింగరావుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

పౌర సరఫరాల శాఖ అధికారి రాంపతి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 23: రైతులు పండించిన చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి రాంపతి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం ఆయన మండ లంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీ లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని మిల్లర్లకు పంపాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాంచందర్, సొసైటీ కార్యదర్శి ఆర్వీ.సత్యనారాయణ, సిబ్బంది పూర్ణ పాల్గొన్నారు.

ధాన్యం తనిఖీ కేంద్రం పరిశీలన

వాజేడు : మండలంలోని చెరుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం తనిఖీ కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి బి.రాంపతి పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ధాన్యాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాంచందర్ ఉన్నారు.

రైస్‌మిల్లుల తనిఖీ

ములుగు కలెక్టరేట్: ములుగు మండలంలోని మల్లంపల్లిలో గల అచ్యుత, లింగాపూర్‌లోని ఆదిత్య రైస్‌మిల్లులను జిల్లా పౌర సరఫరాల అధికారి బి.రాంపతి తనిఖీ చేశారు. ధాన్యాన్ని నాణ్యత ప్రమా ణాల ప్రకారం కొనుగోలు చేసి మిల్లులకు పంపి స్తున్నారని అన్నారు. మిల్లర్లు ఎలాంటి జాప్యం చేయకుండా, రైతులను ఇబ్బందిపెట్టకుండా దిగు మతి చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట డిప్యూ టీ తహసీల్దార్ రాంచందర్ తదితరులు ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

మల్హర్, ఏప్రిల్ 23: మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్లతోపాటు పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. సుమారు గంటన్నరపాటు అతలాకుతలం చేశాయి. దీంతో మల్లారం శివారు లోని పంటలు నేలవాలాయి. తాడిచర్లలో గాలులకు మామిడి కాయలు రాలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే ఈ ఏడాది మామిడి కాయ కాత లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఈదురు గాలులకు మరింత నష్టాన్ని మిగిల్చాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓరుగల్లుపై.. కడియం అస్త్రం!

(5వ పేజీ తరువాయి)

క్లీన్ ఇమేజ్‌కు తోడు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, రేవంత్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ, కాంగ్రెస్‌కున్న సంప్రదాయ ఓటుబ్యాంకు కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

మహిళ అభ్యర్థికి 36ఏళ్లకు కాంగ్రెస్ ఛాన్స్..

వరంగల్ (ఎస్సీ) లోక్‌సభ స్థానంపై కన్నేసిన కాంగ్రెస్ వ్యూహాత్మకంగానే మహిళ అభ్యర్థిని బరిలోకి దించింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను కాంగ్రెస్‌లో చేర్చుకుని, ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి 1984లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ టి. కల్పనాదేవికి 2,32,088ఓట్లు (43.56శాతం) పోలవ్వగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి కమాలుద్దీన్ అహ్మద్‌కు 2,23,632 ఓట్లు (41.98శాతం)పోలయ్యాయి. దీంతో డాక్టర్ కల్పనాదేవి 8,456ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆ తరువాత 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మరోసారి పోటీ చేసిన కల్పనాదేవి ఓటమిపాలయ్యారు. 1998లో కాంగ్రెస్‌లో చేరిన కల్పనాదేవి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి చందులాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి కాంగ్రెస్ మహిళకు వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించలేదు. 36ఏళ్ల తరువాత మళ్లీ డాక్టర్ కావ్యకు కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. అప్పుడు.. ఇప్పుడు ఇద్దరు మహిళ అభ్యర్థులు డాక్టర్లు కావటం గమనార్హం. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,16,543 మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208మంది ఉన్నారు. పురుషులకంటే 32,268 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ క్రమంలో కావ్యకు మహిళల ఓట్లు కలిసి వస్తాయనే అంచనాలో కాంగ్రెస్ ఉంది.

కాంగ్రెస్‌కు పెరిగిన ఓటు బ్యాంకు..

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఓట్లను పొందలేకపోయింది. అయితే రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 మంది కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో పాటు కాంగ్రెస్ ఓటు బ్యాంకు భారీగా పెరిగింది. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో వరంగల్ ఎంపీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు అసెంబ్లీ స్థానాల్లో 6,61,545 ఓట్లు పోలవ్వగా, బీఆర్‌ఎస్‌కు 5,02,578ఓట్లు, బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్‌కు 1,58,967ఓట్ల ఆధిక్యత లభించింది. అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరటంతో పాటు ఆయన కుమార్తె ఎంపీ అభ్యర్థిగా ఉండటంతో తమ బలం మరింత పెరిగిందనే లెక్కల్లో కాంగ్రెస్ నేతలున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందటంతో ఆ పార్టీలో కీలక నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. వరంగల్ సిట్టింగ్ ఎంపీ దయాకర్‌తో పాటు డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో 25మంది వరంగల్ కార్పొరేటర్లు, ఐదు మునిసిపాలిటీల నుంచి చైర్మన్లు, కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరారు. చాలావరకు బీఆర్ఎస్ కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.

నేటి జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ కార్యక్రమానికి హాజరవనున్న సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4గంటలకు మడికొండలో జరిగే జనజాతర బహిరంగసభలో ప్రసంగిస్తారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు పొరుగున ఉన్న ఇతర మండలాల నుంచి కార్యకర్తలను ఈ సభకు భారీగా తరలించేందుకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ పథకాలతో పాటు ఉమ్మడి వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ జిల్లాల విలీనంపై ప్రకటన చేసే అవకాశం ఉందని, అలాగే వరంగల్ నగరానికి నిధులు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, విమానాశ్రయం తదితర అంశాలపై ఓరుగల్లు ప్రజలకు సీఎం హామీలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ తరువాత తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు సభ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు



సత్యవతి (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 23: మండలంలోని యోగితానగర్ గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గొంపెల్లి గ్రామానికి చెందిన లక్ష్మణరావు, ఆయన భార్య సత్యవతి(55) ద్విచక్రవాహనంపై వాజేడు మండలం కొప్పుసూరు గ్రామంలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో మండలంలోని యోగితానగర్ శివారుకు చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే యత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో సత్యవతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా లక్ష్మణరావుకు బలమైన గాయాలయ్యాయి. ఈ సంఘటనను గమనించిన స్థానికులు లక్ష్మణరావును వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగ్గురికి గాయాలు

గణపురం, ఏప్రిల్ 23: టాటా మ్యాజిక్- బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని మైలారం శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండల కేంద్రానికి చెందిన కొలిపాక రాజు, మల్యాల బక్కులు, పాలకుర్తి భాను ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై బయల్దేరారు. పరకాలను నుంచి గాంధీనగర్ వైపు వస్తుండగా ముందుగా వెళ్తున్న భూపాలపల్లి మండలం జంగేడుకు చెందిన టాటా మ్యాజిక్‌ను బైక్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలు కాగా వెంటనే అంబులెన్స్ ద్వారా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సాంబమూర్తి పరిశీలించారు.

రూ. 12 కోట్లతో కోటంచ ఆలయ అభివృద్ధి

• భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

రేగొండ, ఏప్రిల్ 23: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి రూ.12కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఆలయంలో సమకూర్చాల్సిన మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి దేవాదాయ శాఖకు సమర్పిస్తామని, జనవరి కల్లా పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి శామ్యూల్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవో మహేశ్, జాతర కమిటీ చైర్మన్ భిక్షపతి తదితరులు ఉన్నారు

ములుగు కలెక్టర్ పర్యటన

మంగపేట, ఏప్రిల్ 23: ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి మండలంలో మంగళవారం పర్యటించారు. మల్లూరు గ్రామ శివారులోని అత్త చెరువు, కోడలు చెరువులను సందర్శించారు. చెరువులపై ఆక్రమణాలు తొలగించి హద్దులు ఏర్పాటు చేసి, సర్వేలు చేసి ట్రెంచ్‌లను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు దైవదర్శనాలు చేసుకునేం దుకు ఎస్కలేటర్ ఏర్పాటు చేయడానికి అవకాశాలు పరిశీలించాలని ఆలయ ఈవో సత్యనారాయణ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంగపేట- కమలాపురం గోదావరి కరకట్ట నిర్మాణం భూనిర్వాసిత రైతులతో స్థానిక తహసీల్దార్ కార్యలయంలో సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.